

బయోసెంట్రిజం మీద తీవ్రమైన వాదోపవాదాలు జరుగుతున్నాయి. ఒకవేళ ఈ సిద్ధాంతాన్ని ఒప్పుకొంటే కనుక ఇప్పటిదాకా మన జీవితాల మీద పరిసరాల ప్రభావాన్ని గమనిస్తున్న శాస్త్రవేత్తలు, అందుకు విరుద్ధంగా పరిశోధనలు మొదలుపెట్టాల్సి ఉంటుంది. అదేమంత తేలిక కాదు. ఇంతకూ అమరత్వం గురించి బయోసెంట్రిజం ఏం చెబుతుంది? మృత్యువు అనేది అంతం కాదు, మార్పు అంటుంది. మరోచోట మరో ఉనికితో అది ప్రకటితం అవుతుందని అంటాడు రాబర్ట్. ఇది క్వాంటం స్థాయిలో జరుగుతుంది కాబట్టి, దాన్ని మనం నిరూపించలేం అని వాదిస్తాడు.

**శక్తి మారుతుంది... అంతే!**

భౌతికశాస్త్రంలోని మౌలిక సిద్ధాంతాలో ఒకటి కన్జర్వేషన్ ఆఫ్ ఎనర్జీ (conservation of energy). దీని ప్రకారం శక్తిని మనం ఉత్పత్తి చేయలేం, నాశనమూ చేయలేం. దాని రూపం మారుతుంది అంతే! బొగ్గు విద్యుత్తుగా, విద్యుత్తు వెలుగుగా రూపాంతరం చెందినట్టు అన్నమాట. వేగంగా విసిరే బంతి సైతం శక్తిని (కైనెటిక్ ఎనర్జీ) సమకూర్చుకుంటుంది. మరి కదిలేమెదిలే శరీరంలో చలనం ఆగిపోతే, ఆ శక్తి ఏమవుతుంది? అది ఉష్ణోగ్రతగా రూపాంతరం చెంది పరిసరాల్లో కలిసిపోతుందని కొందరు అంటారు. పార్థివదేహం చల్లబడటమే ఇందుకు సూచనగా చెబుతారు. మరణం తర్వాత ఏళ్ల తరబడి మనం పొందిన అనుభవాలు, ఏర్పరుచుకున్న విచక్షణ అన్నీ కూడా దేహం నుంచి బయటికి వస్తాయనీ... దాన్నే ఆత్మగా భావించవచ్చని కొందరి భావన. అది మరో శరీరంలో ప్రవేశించడమో (పునర్జన్మ), మరో లోకంలో (మల్టీవర్స్) జీవించడమో జరుగుతుందని ఓ ప్రతిపాదన.

**మనం మనమేనా!**

కృత్రిమ మేధస్సు రోజురోజుకూ ఎంతలా ఎదుగుతున్నదో చూస్తున్నాం. వాటికి కూడా సొంత ఆలోచనలు, విచక్షణ అలవర్చే ప్రయత్నం మెరుగవుతున్నది. కొన్నాళ్లకు ఆ రోబోలు తాము నిజమైన జీవులం అనుకుంటే! వినడానికి భయంగా ఉన్నా... ఇది అసాధ్యమైతే కాదు. ఈ సిద్ధాంతాన్ని నిరూపించడానికి రోబో లాంటి సినిమాలే అక్కర్లేదు. సరే ఇప్పుడు దీన్నే మనుషులకు వర్తింపచేద్దాం. ఒకవేళ ఎవరో ఆధునికమైన జీవులు మనుషుల్ని రూపొందించి ఉంటే... వాళ్లు ఇలా ఉండాలి, ఇలా ప్రవర్తించాలి అని ఎక్కడినుంచో నియంత్రిస్తూ ఉంటే... అది నిజమే అని భావించేవారు లేకపోలేదు. ఒకవేళ అది అసాధ్యం అనుకుంటే కనుక అసిమోవ్ మాటల్ని ఓసారి వినాలి. రష్యాలో పుట్టి అమెరికాలో స్థిరపడిన ఐజాక్ అసిమోవ్ ప్రముఖ శాస్త్రవేత్త మాత్రమే కాదు చరిత్రలోనే ఉత్తమ సైన్స్ ఫిక్షన్ రచయితగా పేరు తెచ్చుకున్నారు. రోబోటిక్స్ అన్న పదం ఆయన సృష్టించిందే. రోబోల మీద తీసే ప్రతి సినిమా మీదా ఆయన రచనల ప్రభావం ఉంటుంది. ఇదంతా ఎందుకంటే అసిమోవ్ అంచనా ప్రకారం మనుషులు ఉన్న విభజన రేఖ రోజురోజుకూ సన్నబడిపోవడం ఖాయం. మనుషులు క్రమంగా తమ శరీరాల్లో రకరకాల పరికరాలను అమర్చుకుంటున్నారు. అత్యవసర సందర్భాల్లో వాడే పేస్‌మేకర్లు, కాక్లియర్ ఇంప్లాంట్ గురించి తెలిసిందే. ఇవే కాకుండా మెదడులో చిప్ పెట్టుకోవడం, వేగంగా కదిలే కాళ్లని అమర్చుకోవడం లాంటి ప్రయోగాలు ఊపందుకుంటున్నాయి. మరోవైపు రోబోలకేమో సహజమైన చర్మం, మెదడు లాంటివి జోడిస్తున్నారు. అసిమోవ్ సిద్ధాంతం ప్రకారం మనిషి క్రమంగా రోబో వైపు, రోబో క్రమంగా మనిషి వైపు వచ్చి... ఇద్దరి మధ్యా ఉన్న హద్దు చెరిగిపోతుంది. ఎవరు మనిషి, ఎవరు రోబో తెలియకుండా పోతుంది. ఈ పరిస్థితి అమరత్వానికి దారితీస్తుంది.

క్వాంటం ఫిజిక్స్ పేరుతో చెప్పినంత మాత్రాన... ఇవన్నీ నిజాలు అని విజ్ఞానలోకం ఒప్పుకొన్నట్టు కాదు. ప్రతి శాస్త్రంలోనూ సవాలక్ష అభిప్రాయాలు, సిద్ధాంతాలు ఉంటాయి. వాటిని మన పరిమిత దృష్టికి కూడా నిరూపించగలిగితేనే నమ్మగలం. ఉదాహరణకు మన కళ్లకు ప్రతీ వస్తువూ ఎత్తు, లోతు, వెడల్పుగానే (త్రీడీ) కనిపిస్తుంది. కానీ నాలుగో పార్శ్వం కూడా ఉందని ఐన్‌స్టీన్ ప్రతిపాదించాడు. దాన్ని మనం చూడలేకపోయినప్పటికీ సిద్ధాంతపరంగా నిరూపించగలిగాడు. ఆత్మ, అమరత్వం, మల్టీవర్స్ లాంటివి కూడా సిద్ధాంతపరంగా నిరూపించాల్సిన అవసరం ఉంది. అప్పుడే వాటి మీద నమ్మకం ఏర్పడుతుంది. అలా నిరూపించిన రోజు కూడా విజ్ఞానశాస్త్రానికి ఓటమి ఏమీ కాదు. మనిషిలోని మూలశక్తిని సైతం కనుగొన్న విజయం మాత్రమే!

**క్వాంటం ఓ మాయా ప్రపంచం!**

భౌతికశాస్త్రం అనగానే అందరికీ న్యూటన్ సూత్రాలు, ఐన్‌స్టీన్ సిద్ధాంతాలు గుర్తుకువస్తాయి. ఓ వస్తువు ఎందుకు, ఎలా పనిచేస్తుంది అని పరిశీలించి కారణాలు నిరూపించేదే భౌతిక శాస్త్రం. క్వాంటం భౌతికశాస్త్రం మరో మెట్టు కిందికి దిగుతుంది. కంటికి కనిపించేవాటి వెనుక కనిపించని రహస్యాలను ఛేదిస్తుంది. ఉదాహరణకు బల్బ్ వేయగానే ప్రసరించే వెలుగుకు కారణం, దాని నుంచి వెలువడే ఫోటాన్లే అని గమనిస్తుంది. విద్యుత్ ప్రవాహానికి కీలకం, ఎలక్ట్రాన్లే అని ప్రతిపాదిస్తుంది. ఈ అణువులు, పరమాణువుల స్థాయిలో పరిశోధించే క్వాంటం శాస్త్రానికి ఓ సవాలు ఉంది. దాన్ని ప్రతిపాదించిన ష్రోడింగర్ అనే శాస్త్రవేత్త పేరు మీదుగా 'ష్రోడింగర్ క్యాట్' అని దానికి పేరు. ఓ చిన్న గదిలో పిల్లి ఉంది అనుకుందాం. అదే గదిలో విషపు సీసా కూడా ఉంది. పిల్లి ఆ విషం తాగిందా, తాగి బతికే ఉందా, లేదా అసలు సీసా జోలికి పోకుండా ఉందా... ఇదంతా కూడా ఆ గది తలుపు తెరిచే వరకూ తెలియదు కదా! ఒకవేళ ఓ పిల్లి ఏ బాదరబందీ లేకుండా పడుకుని ఉన్నా, గది తలుపు తీయగానే ఉలిక్కిపడి లేవచ్చు కూడా. పరమాణువులు కూడా ఇంతే అంటారు ష్రోడింగర్. ఓ వ్యక్తి వాటి జోలికి వెళ్లే వరకూ అవి ఎలా ప్రవర్తిస్తాయో తెలియదు. అంతేకాదు! పరిశీలించే సమయంలో కూడా వాటి స్వభావం మారిపోవచ్చు. మన చుట్టూ ఉన్న ప్రపంచంలోనే ఇంత మార్మికత ఉంది కాబట్టి, క్వాంటం ఫిజిక్స్ మరణం తర్వాత కూడా ఏదో ఉండి ఉంటుందనే ప్రతిపాదనను సమర్థిస్తున్నది.




